హాస్యకథ

# సరసమైన సాయంత్రం

— ఎమ్బీయస్. ప్రసాద్

పెళ్ళయి హైదరాబాద్‌కి కాపురానికి వచ్చే ముందు నుండే సావిత్రి టాంక్‌బండ్, ఇందిరాపార్క్ భాగోతాల గురించి చదివింది, వింది. సాయంత్రాలలో అక్కడ జంటలు చేరిచేసే పనుల గురించి ఆమె స్నేహితురాళ్ళు చెప్తూంటే 'నిజంగానా? అంత సిగ్గులేకుండానా?' అని ఆశ్చర్యపడుతూనే తరచితరచి అడిగి తెలుసుకునేది. తన కలల రాకుమారుడితో కలసి తనూ ఆయా స్థలాలలో విహరించినట్టు ఊహించుకొనేది.



సినిమాలలో అయితే పార్కుల్లో, బీచిల్లో అబ్బాయి, అమ్మాయి ఎంత ప్రేమ ఒలకబోసినా పోలీసులు ఒవ్వక్కోరు వెనకాల ముప్పై, నలభై మంది డ్యాన్సర్లుండగా ఈ జంట హద్దు మీరదని వారి ధీమా. కానీ నిజజీవితంలో ఓ మగా, ఓ ఆడా కాస్త మూలగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నా దారిన వెళ్ళే ప్రతివాడూ పరికించి చూసేవాడే. అలాంటప్పుడు పోలీసులు వచ్చి అల్లరి పెట్టకుండా ఉంటారా?

పెడతారనే వింది సావిత్రి. స్టేషన్‌కి లాక్కెళతామని బెదిరిస్తారట, సైకిలు మీద ముగురెక్కితేనే 'చదుకున్నారు, ఆ మాత్రం తెలీదా' అని తిట్టేవాళ్ళు ఇలాంటి ఘట్టాల్లో వదిలిపెడతారా? హితబోధలు చేసి, పెద్ద వాళ్ళకు కబురంపించి ... అమ్మో.. తలచుకుంటేనే సావిత్రికి ముచ్చెమటలు పోసేవి.

తనూ ఎవరినో ప్రేమించాలనీ, ఎవరిచేతనో ప్రేమించబడాలనీ, అందరూ గొప్పగా చెప్పకునే 'ప్రేమ' అనుభవించాలని సావిత్రి అనుకొనేది. కానీ ప్రేమ కథలన్నీ విషాదాంతాలే కావడంతో పోనీ పెళ్ళయ్యేక భర్తవే తీరిగ్గా ప్రేమిస్తే క్షేమదాయకం కదా అని సర్ది చెప్పకుంది. కానీ ఇలా ట్యాంక్‌బండ్‌పై రసవద్ఘట్టాలు 'మిస్' కావడం మాత్రం జీవితంలో పెద్ద లోటుకదా అని బాధపడుతూండేది.

రాజాతో పెళ్ళి నిశ్చయమయాక ఆమె తన రొమాంటిక్ ఈవెనింగ్ కలకు ఒక రూపాన్నివ్వవలసింది. తాంబూలాలు పుచ్చుకున్నాక, పెళ్ళి నిశ్చయమైంది కాబట్టి అతనూ, తనూ టాంక్‌బండ్‌కి వెళ్ళి బహిరంగంగా 'ఏకాంతాన్ని' అనుభవించవచ్చు. పోలీసులు పట్టుకున్నా ఫర్వాలేదు. ఎలాగో పెళ్ళికాబోయే వాళ్ళేగా. పెద్ద వాళ్ళకి తెలిసినా నవ్వుతూ నాలుగు చివాట్లు వేస్తారు తప్ప కొంపేం మునగదు.

ఈ విషయంలో రాజా అభిప్రాయం కనుక్కొని హైదరాబాద్ వెళితే మంచిది. పట్టుచీరలు కొనాలని వంక పెట్టవచ్చు, బంధువుల ఇంట్లో దిగవచ్చు. ఓ సాయంత్రం ఇద్దరూ కలిసి వెళ్ళనచ్చు.

కానీ రాజాకు ఉత్తరంలో ఇవన్నీ రాయాలంటే జంకువుట్టింది. 'ఇలాంటి రొమాంటిక్ అయిడియాలు అతని ఒంటికి పడతాయో, లేదో? 'కుర్రవాడు బుద్ధిమంతుడు' అని పెళ్ళి చేస్తారు కానీ 'రసికుడా, కాడా' అని తెలుసుకోరు. 'అయ్యో, ఈ అమ్మాయి ఫాస్ట్ టైప్‌లా వుంది' అనుకొని అతను పెళ్ళి కాన్సిల్ చేస్తే? ఇలా ఎంత మందితో తిరిగిందో అంటూ అభండాలు వేస్తే జన్మలో పెళ్ళికాదు. పగటి కలల వరకే మన రొమాన్స్ పరిమితం చేసుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు' అనుకుని ఊరుకుంది సావిత్రి.

పెళ్ళయ్యేక మొగుణ్ణి కదలేసి చూసింది – 'అలా సరదాగా ఇందిరా పార్కుకో, టాంక్‌బండ్‌కో వెళదామా' అని. 'ఎందుకూ, పోరంబోకులు తిరిగే చోట్లవి. మన ప్రైవసీకి ఇంట్లో లోటేముంది? మా అమ్మా, నాన్నా ఎవరూ లేరు మనతో. మనిద్దరమూ అక్కడికెళ్ళి వెలగబెట్టాల్సిన శృంగారం ఏముంది? ఇక్కడేమైనా అడ్డా? ఆపా?' అని తీసిపారేసాడు.

ఇంట్లో ఎంత సన్నిహితంగా మసలినా పది మంది ఎదుటా, పార్కు బెంచీ మీద అలా మొగుడి ఒళ్ళో పడుకోవడం, స్కూటరు మీద వెళుతూ అతని తొడమీద చేయి వేయడం – అదో సరదా తనకి. అవన్నీ అతనికి విప్పి చెప్పడం ఎలా? చెప్పకూడదు కూడా. మింగుడు పడకపోతే 'నీకేమైనా వెర్రా?' అంటాడు. అందుకని 'సరదాగా వెళ్ళి చల్లగాలి పీల్చివద్దాం. ఇంట్లో మగ్గిపోవడం ఎందుకు?' అంది.

'చల్లగాలా? మురికి గాలా? అంతగా మగ్గిపోతుంటే ఎయిర్ కూలర్ కొందంలే' అన్నాడు రాజా.

ఇలాంటి వాడిని సాధించినా, వేధించినా ఏం ప్రయోజనం? అందుకే పెళ్ళయి ఆర్నెల్లయినా సావిత్రి కోరిక తీరలేదు. తీరని కోరిక ఇంకా బలపడి కొమ్మలు, రెమ్మలు వేసింది. ముందులో మొగుడూ, తనూ చెట్టాపట్టాలు వేసుకుని కూచుంటే చాలనుకొనన్నది, ఇంకా కాస్త ముందుకెళితే బాగుంటుందనిపించింది. బస్సులో వెళుతూండగా ఆమె కంటపడ్డ జంటలు చాలా చాలా ముందుకెళుతున్నారు.

పోలీసు వచ్చి పట్టుకుంటాడన్న ఆలోచనవ లేకపోలేదు సావిత్రికి. దానికి ఏం చెయ్యాలో ముందే ప్రణాళిక వేసి పెట్టుకుంది. 'అసలు పోలీసు వచ్చి పట్టుకుంటేనే 'థ్రిల్' లేకపోతే ఏముంది? ఇంట్లో వున్నట్టే వుంటుంది. పెళ్ళికాని పిల్లలా వుండాలి తను. (మట్టెలు కొట్లో పెట్టేయచ్చు, మంగళ సూత్రం లోపలికి ఎక్కడికో తోసేయచ్చు) తనూ, రాజా మంచి రొమాంటిక్ మూమెంటులో వుండగా పోలీసు వస్తాడు, స్టేషన్‌కి రమ్మని అదలిస్తాడు, స్టేషను కెళ్ళాకనే తను చెప్తుంది – 'మేమిద్దరమూ మొగుడూ పెళ్ళాలమేరా నాయనా' అని. మంగళసూత్రం చూపిస్తుంది. కావాలంటే ఇంటికొచ్చి పెళ్ళి ఫోటోలు చూడమంటుంది. దెబ్బకి డంగై పోతాడు పోలీసు సారీ చెప్పి ఆటో ఎక్కించి, ఇంటికి పంపుతాడు. సరదాకి సరదా తీరుతుంది, సేఫ్టీకి సేఫ్టీ వుంటుంది!

రాజాకు ఇవన్నీ చెప్పడం అనవసరం అనుకుంది సావిత్రి. 'ఎందుకొచ్చిన వేషాలివి?' అని విదిలించేయవచ్చు. వెంకటేశ్వరస్వామి గుడికి అని బయలుదేర తీసింది. ఓ శనివారం సాయంత్రం. అక్కడ రద్దీ ఎక్కువగా వుండటంతో

దర్శనమయ్యేసరికి బాగా చీకటిపడింది. టాంక్‌బండ్ మీద నుంచి వెళదామని మారాం చేసింది. ఏ కళ నున్నాడో రాజా సరేనన్నాడు. ఇద్దరూ ఒక ఖాళీ బెంచీ మీద కూచున్నారు. చీకటిగా, ఓ పక్కగా ఉన్నందుకు సంతోషించింది సావిత్రి. భర్త మెడచుట్టూ చేతులేసి కబుర్లు చెప్పసాగింది. భర్తను మూడ్‌లోకి తీసుకు రావాడం ఎలాగో ఈ ఆర్నెల్లలోనూ ఆమె నేర్చుకుంది.

కానీ రాజా మూడ్‌లోకి రాలేకపోతున్నాడు. రెండేళ్ళ క్రితం టాంక్ బండ్ మీద జరిగిన సంఘటన అతని మనస్సులో మెదులుతూండడం వలన. సావిత్రి అనుకొనేటంత అరసికుడు కాదతను. బస్‌లో ఆఫీసు కెళ్ళే దారిలో రోజూ ఓ డాబా మీద కనబడే అమ్మాయికి చెయ్యి ఊపుతూండే వాడతను. ఓ రెన్నెల్ల తరువాత ఆ అమ్మాయి బస్టాపులో కనబడితే పలకరించాడు. వారం తిరక్కుండా టాంక్‌బండ్‌కి రావడానికి ఆమెను ఒప్పించగలిగాడు.

ఆ రోజు, ఈ టైములో ఆ అమ్మాయి ముద్దుపెట్టుకుంటూంటే భుజంమీద చెయ్యి పడింది. పోలీసు కానిస్టేబుల్. హిప్ పాకెట్లోంచి ముందే పెట్టుకున్న పది రూపాయల నోటు తీసి అందించాడు. మారు మాట్లాడకుండా వెళ్ళిపోతున్న పోలీసు ఆ అమ్మాయిని చూసి ఆగిపోయాడు. అమ్మాయి మొహం తిప్పేసుకుంది. పోలీసు డబ్బు వెనక్కు ఇచ్చేసి 'పోకిరీ వేషాలేస్తున్నావ్ స్టేషన్‌కి పద' అన్నాడు.

రాజా అప్పట్లో మంచి ధైర్యంగా ఉండేవాడు. 'భలేవారే, నా వైఫ్ సార్. ఏదో సరదాగా షికారు కొచ్చాం' అని డబాయించాడు.

ఇంతలోనే పోలీసు ఆ అమ్మాయి రెక్క పుచ్చుకుని వేసాడు. 'సదువుకోవే అని ట్యూషన్‌కి పంపితే గిదా నువ్‌జేసేది? ఇంటికొచ్చినాక జెప్తా నీ పని' అంటూ ఓ ఆటోను పిలిచి 'నా బిడ్డను మా ఇంటిలోన దింపు' అని పురమాయించాడు. ఆ అమ్మాయి రాజా వంక చూడనైనా చూడకుండా ఆటో ఎక్కింది. మరుసటి రోజు నుంచి డాబా మీద కనబడితే ఒట్టు.

ఒక వేళ కనబడినా కూడా ఒక వారం దాకా రాజా చేయి ఊపలేక పోయేవాడు. ఆవేళ, పోలీసు స్టేషన్లో చెయ్యి మెలిపెట్టడంతో విరిగినంత పనయింది. పోలీసు చేతిదెబ్బలు రెండు తినేసరికి బుగ్గలు వాచి రెండు రోజులు సెలవు పెట్టవలసి వచ్చింది.

భార్య మాటలకు ఊకొడుతున్నా, ఆమె శృంగార చేష్టలకు అసంకల్పితంగానే ప్రతిస్పందిస్తున్న రాజా కళ్ళముందు అనేక దృశ్యాలు తిరుగుతున్నాయి.

'మళ్ళీ అదే పోలీసు, తమ సావిత్రిని భార్యని చెప్పినా అతను ననమ్మకపోవడం, స్టేషన్‌కి లాక్కెళ్ళడం, చెయ్యి ... కలుక్... ఈసారి ఫ్రాక్చర్'.

పోలీసు నమ్మి వెళ్ళిపోవడం, కాని సావిత్రికి తన ఫ్లాష్ బాక్ తెలిసిపోవడం, కోపం తెచ్చుకోవడం, ఫిడాకులకై అర్జీ..'

'పోలీసు కూతురు, తన ప్రస్తుత ప్రియుడిని వెంటబెట్టుకు రావడం, సావిత్రిని చూసి జాలిగా చిరునవ్వు నవ్వడం, 'పీడొట్టి దద్దమ్మ' అని తన గురించి చెప్పడం'

తలలోంచి ఆ దృశ్యాలు చెరిపేయడానికి రాజా 'తలగట్టిగా విదిలించాడు' ముద్దు పెట్టుకోబోయిన సావిత్రి చికాకు పడింది. అతని తల కదలకుండా రెండు చేతులా పట్టుకుని పెదాల మీద గట్టిగా ముద్దు పెట్టుకుంది.

రొమాంటిక్‌గా ఉండడంతో తనెవరికీ తీసిపోనని సావిత్రి సంతోషిస్తుండగానే 'మీరిక్కడికి వచ్చి ఎంత సేపయిందండీ' అనే ప్రశ్న వినబడింది.

రాజా, సావిత్రి దూరంగా జరిగి పక్కనే నిలబడ్డ వ్యక్తికేసి చూశారు. ఆజానుబాహువు. మిలటరీ వాడిలా మీసాలు. బొంగురు గొంతుక. మఫ్టీలో వున్న పోలీసేమో! 'మా ఫామిలీ అండి. ఊ...

..ఊరికే...సరదాగా.." అన్నాడు రాజా వణుకుతున్న గొంతుకతో.

భర్త భయం చూసి సావిత్రి నవ్వుకుంది. వచ్చినవాడు భర్త మాటలు పట్టించుకోకుండా చటుక్కున కిందకు వంగి దేనికోసమో వెతుకుతున్నాడు. 'తామెంత దూరంపోయి ఉంటామో నని పరీక్షిస్తున్నాడు కాబోలు' అన్న ఊహ పోయి నవ్వు వచ్చింది సావిత్రికి. నవ్వుకుంటూనే మంగళసూత్రం తడిమి చూసుకోబోయింది– అంతగా అవసరమైతే చూపించాలి కదాని. చేతికి తగల్లేదు. మెడలో లేదు. ఇందాక గుడి నుంచి ఆ బజారు సందులోంచి వచ్చేడప్పుడు మెడమీద ఏదో పాకినట్టనిపించింది. ఎవడైనా కొట్టేసేడేమో.

'ఇప్పుడిలాగ? తామిద్దరూ భార్యభర్తలమని సాక్ష్యాలూ, సంపన్నలూ చూపించే లోపునే రాజాని లాకప్పులో వేసి చావగొట్టేస్తే? తనను రేప్ చేసేస్తే?' నుదుటి మీద చెమట తుడుచుకుంది సావిత్రి.

వచ్చినతను లేచి నుంచొన్నాడు అతనూ ఖంగారుగానే ఉన్నాడు. –"...నేనూ, మా ఫ్రెండూ ఇక్కడ కూచున్నాం ఇందాక... నా పర్సు... బ్లాక్ కలర్‌ది... పోయింది. కింద పడిందేమో...మీరు చూశారా?.. మీరొచ్చేముందు వేరెవరైనా కూచున్నారా?... మేం వెళ్ళి ఓ హాఫేనవరయి ఉంటుంది" అని మాట్లాడుతూనే వెతుకుతున్నాడు రాజానూ, సావిత్రినీ లేవమన్నట్టు సైగ చేశాడు.

రాజాకు భయం పోయింది. 'ఓకే ఓకే' అంటూ నిలబడ్డాడు కానీ సమాధానం ఏది చెప్పాలో అతనికి తట్టడం లేదు. సావిత్రి నిలబడడంతో లోపల 'క్లింగ్'మని చప్పుడయింది. తడిమి చూసుకుంది. హుక్ ఊడి లోపల పడిపోయింది మంగళసూత్రం. హమ్మయ్య! అనుకునే లోపునే 'వీడెవడైనా దొంగేమో, ఏదో కథ చెప్పి దగ్గరకొచ్చి కత్తి చూపిస్తాడేమోనన్న ఊహపోయి మళ్ళీ భయం పట్టుకుంది. మంగళసూత్రం కూడా ఇంట్లో పడేసి వస్తే బాగుండేదనిపించింది.

వచ్చినతను బెంచీ కిందా, పైనా వెతికి 'బ్లడీ బి..' అనుకుంటూ లేచాడు. ఏమీ దొరకనట్టుంది. వెళ్ళి మోటారుసైకిల్ స్టార్ట్ చేయబోతూ వెనక్కి వచ్చాడు. నాలుగడుగులు దూరంలో నుంచొని రాజా నుద్దేశించి,

"బ్రదర్, బీ కేర్‌ఫుల్... ఫ్రెండ్ అని చెప్తా కదా, ఫ్రెండ్ కాదు, ఇక్కడే తగిలింది. ఇలాగే ఓ డీప్ కిస్సిచ్చి పర్సు కొట్టేసింది. డబ్బు సంగతి వదిలేయ్. ఐడెంటిటీ కార్డు పోయింది. నువ్వైనా జాగ్రత్తగా ఉండు బ్రదర్" అని హెచ్చరించి గబగబా వెళ్ళి కసిగా మోటారుసైకిల్ కిక్కిచ్చాడు.

ఆ తర్వాత టాంక్‌బండ్‌కు వెళ్దామని చాలా నెలల దాకా సావిత్రి అనలేదు.

